క్లుప్తంగా

నేటి నుంచి యత్తప్పస్వామి ఉత్సవాలు


అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లు గొల్లహట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం యత్తప్పస్వామి ఉత్సవాలు సోమవారం నుంచి శనివారం వరకూ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉత్సవాలు ప్రారంభం రోజున స్వామివారి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి పూజలు చేయనున్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఇది వరకే పెద్ద ఎత్తున ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈనెల 16న జరిగే పాలు పోసే పండగ, అదే రోజు రాత్రి యత్తప్పస్వామి, చిత్రలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన అవసరం

చిలమత్తూరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు జిల్లా ప్రచార కార్యకర్త బి. ఆంజనేయులు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం మొదలై నేటికి 20 ఏళ్లు అయిందన్నారు. ఈ చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే కాకుండా అవినీతిని అరికట్టగట గొప్ప చట్టమన్నారు. ఇప్పటికే అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలకు అర్థమయ్యేలా గైడ్‌బుక్ కూడా రూపొందించామన్నారు.

ఘనంగా గ్యార్మీ


గ్యార్మీ వేడుకలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

గుడిబండ: మండల కేంద్రంలో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్ సుభానీ దర్గా సమీపంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, గ్యార్మీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.
పెనుకొండ: ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెండా మాను వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పరీక్ష

హిందూపురం టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఫిలాటలీ (పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనం)పై ఆసక్తిని పెంచేందుకు ఉద్దేశించిన 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' స్కాలర్‌షిప్ కోసం ఆదివారం పట్టణంలోని ఎన్.ఎస్.పీ.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షను నిర్వహించారు. తపాలాశాఖ సూపరింటెండెంట్ విజయ కుమార్ పరీక్షను పర్యవేక్షించారు. ఎంపికైన వారికి నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6,000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారన్నారు.

ప్రపంచ పాస్టర్ల దినోత్సవం


పాస్టర్లను సన్మానిస్తున్న చర్చి సభ్యులు

హిందూపురం: అనునిత్యం ఆధ్యాత్మిక బోధనలతో భక్తులను సన్మార్గంలో నడిచేందుకు పాస్టర్లు ఎంతో కృషిచేస్తున్నారని సీఎండ్‌బజీ మిషన్ కాంపౌండ్ చర్చి ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక మిషన్ కాంపౌండ్ చర్చి కార్యదర్శి డాక్టర్ నాగేంద్ర కుమార్ అధ్యక్షతన ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ డాక్టర్ స్టీఫెన్ రాజు, బ్రాంచి సంఘాల పాస్టర్లు కె. దేవరాజ్ , ఆనంద్‌రాజ్, సభ్యులు ప్రకాష్, కోశాధికారి సాల్మన్‌రాజ్, బోర్డు సభ్యులు అరుణ్‌కుమార్, ఆంజనేయులు, జార్జ్‌బాబు, రూబేన్ పాల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన


అలంకరణలో గుడ్డం రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయంలో స్వామివారి గిరి ప్రదర్శన ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు గోవింద నామ స్మరణ మధ్య స్వామివార్లను పూల రథంలో కొలువు దీర్చారు. అనంతరం గిరి ప్రదర్శన నిర్వహించారు.

వేరుశనిగ



- పంట కోత పనులు ప్రారంభించిన రైతులు
- తగ్గిన దిగుబడి .. పెట్టుబడి కూడా రాదని అన్నదాతల ఆవేదన
- ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వేడుకోలు

అమరాపురంలో వేరుశనగ పంటను తొలగించిన దృశ్యం

మడకశిర: ఈ ఏడాది కూడా వేరుశనగ రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఇటీవల మడకశిర నియోజకవర్గంలో కురిసిన వర్షాలకు రైతులు వేరుశనగ పంట కోత ప్రారంభించారు. అయితే వేరుశనగ చెట్లలో కాయలు నామమాత్రంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి తగ్గి రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో తప్పకుండా లాభాలు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకుని అన్నదాతలు వేరుశనగ పంట సాగు చేశారు. అయితే వారి ఆశలు ఆవిరయ్యాయి.

11,400 హెక్టార్ల సాగు

మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 23,973 హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు కావాలి. కేవలం 11,480 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే వేరుశనగ పంట సాగైంది. పంట సాగుకు సకాలంలో వర్షాలు పడకపోవడంతో విస్తీర్ణం తగ్గడానికి కారణంగా మారింది.

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	సాగైన పంట (హెక్టార్లలో)
మడకశిర	5,236	1,980
అమరాపురం	6,686	4,220
గుడిబండ	5,141	3,160
రొళ్ల	4,377	1,792
అగళి	2,533	328
మొత్తం	23,973	11,480

పూర్తిగా తగ్గిన పంట దిగుబడి

నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరువనగ పంటను రైతులు తొలగిస్తున్నారు. ఇటీవలనే వర్షాలు రావడంతో భూమి మెత్తబడడంతో రైతులు పంట కోతను ప్రారంభించారు. అయితే పంట దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. ప్రధానంగా ఎకరా వేరుశనగ పంట సాగుకు రైతులు రూ.25 వేల చొప్పున ఖర్చు పెట్టారు. తీరా చూస్తే వేరుశనగ చెట్లలో 15 కాయలు కూడా లేవు. కనీసం 25 నుంచి 30 కాయలు ఉంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. లేకపోతే నష్టాలు తప్పవు. ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.10 వేలు కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు చేసిన తర్వాత ఊడలు దిగే సమయంలో కూడా వర్షాలు రాకపోవడంతో దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణంగా మారింది. కర్షకులు అప్పులు చేసి పంట సాగు చేయగా .. ఈసారి కూడా వారికి అప్పుల బాధలు తప్పేలా లేవు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వేరుశనగ రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



ఖరీఫ్‌లో రెండెకరాల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు చేశాను. రూ.50 వేలు పంట సాగుకు ఖర్చు చేశాను. అప్పు తీసుకొచ్చి పంట సాగు చేశాను. అయితే ప్రస్తుతం వేరుశనగ పంట దిగుబడి ఏమాత్రం లేదు. చెట్లలో నామమాత్రంగానే కాయలు ఉన్నాయి. రూ.10 వేలు కూడా పుట్టదు. కూటమి ప్రభుత్వం వేరుశనగ రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– మల్లేశప్ప, ఫళారం, గుడిబండ

ప్రభుత్వం ఆదుకోవాలి



వేరుశనగ పంట దిగుబడి నామమాత్రంగా ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ఇబ్బందులు తప్పేలాలేవు. కూటమి ప్రభుత్వం వేరుశనగ రైతుల కష్టాలను గుర్తించాలి. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందించి అన్నదాతలను ఆదుకోవాలి.

–ఇంతియాజ్, బసవనపల్లి, అమరాపురం మండలం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న సమన్వయకర్త టీఎన్ దీపిక, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని

చిలమత్తూరు: కమిటీల ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఆదివారం రాత్రి హిందూపురం పట్టణంలోని 29వ వార్డులో సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ వార్డు కమిటీని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలు, వార్డుల్లో కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారానే ప్రతి ఒక్క కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. కౌన్సిలర్ రోషన్ అలీ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అమానుల్లా, సంయుక్త కార్యదర్శి ఫరూక్, బీసీ సెల్ , మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామాంజినేయులు, కవితారెడ్డి, వార్డు ఇన్‌చార్జి లు శ్రీనాథ్, ఆసిఫ్, నేతలు నాగేంద్ర, బాబాజాన్, యహసన్, ఉమర్ ఫరూక్, తౌషిఫ్, ఇమ్రాన్, గౌస్ పీర్, హసీబ్, ముజీబ్, సబిల్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

అగళి: దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అనుమతి లేకుండా టపాకులు అమ్మినా, నిల్వ చేసినా చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్బారావు, ఎస్ఐ వీరేష్ తెలిపారు. అక్రమంగా టపాసులు విక్రయిస్తుంటే డయల్ 112 లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

- నేడు ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసనలు
- విజయవంతం చేయాలని పార్టీ సమన్వయకర్తల పిలుపు


ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు


టీఎన్ దీపిక, హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త


ఈరలక్కప్ప, మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో కల్తీ మద్యం దందా జోరుగా సాగుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపుమేరకు సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కల్తీ మద్యం ఏరులై పారుతోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శింరు. కల్తీ మద్యం తాగి పేదలు ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ నాయకులు కల్తీ మద్యం తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకుని పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కల్తీ మద్యం ద్వారా అధికార పార్టీ నాయకులు రూ.వేలకోట్లను అక్రమంగా సంపాదిస్తున్నారని విమర్శించారు. ఊరూరా మద్యం బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి పేదల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. మద్యం వ్యవహారంలో కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. కల్తీ మద్యాన్ని అరికట్టి పేదల ప్రాణాలను కాపాడాలని, బెల్ట్ షాపులను ఎత్తి వేయాలని, కల్తీ మద్యం తయారు చేస్తున్న టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అన్ని అనుబంధ విభాగాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.
చిలమత్తూరు: కల్తీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం హిందూపురం పట్టణంలోని ఎక్సైజ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో కల్తీ మద్యం, బెల్టు షాపుల దందా కొనసాగుతోందని, ఎమ్మెల్యే బాలకృష్ణ బెల్టుషాపుల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఎత్తేయాలని, కల్తీ మద్యం విక్రయించకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపుమేరకు ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాధితులకు అండగా 'డిజిటల్ బుక్'


డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

గుడిబండ: వైఎస్సార్‌సీపీ కార్యాకర్తలపై టీడీపీ నాయకులు చేస్తున్న కక్షసాధింపు చర్యలను న్యాయపరంగా ఎదుర్కోవడానికి వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఉపయోగపడుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహ ఆవరణలో మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడుతో పాటు పలువురు నాయకులతో కలసి డిజిటల్ బుక్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ అమలు చేయాలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల కోసం నిలదీస్తుంటే అధికారాన్ని అడ్డుపెట్టుకొని కక్షపూరితంగా కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. అన్యాయంగా ఇబ్బందులు గురైన వారిని న్యాయపరంగా ఆదుకోవడం కోసం, కార్యకర్తలకు రక్షణ కల్పించడానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌కు రూపకల్పన చేశారన్నారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ నిర్భయంగా డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతుడు జబీవుల్లా (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జబీవుల్లా (42) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. మందలపల్లి గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా జబీవుల్లా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చనిపోవడానికి గంట ముందు కూడా పార్టీ కోసం చురుగ్గా పని చేసి చేశారు. మండల కేంద్రంలో సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం కొన్ని నిమిషాలకు ముగుస్తుందన్న సమయంలోనే గుండెపోటుతో చనిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు జబీవుల్లా మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన జబీవుల్లా ఉన్న ఫలంగా మృతి చెందడం బాధాకరమని ఈరలక్కప్ప పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ యంజారేగౌడు, సర్పంచ్ అశ్వత్, నాయకులు రమేష్ తదితరులు జబీవుల్లా మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్సీ కాలనీలో మరొకరు...

పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలసి ఆదివారం హనుమప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు హనుమప్పకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. ఈరలక్కప్ప వెంట సర్పంచ్ కరుణాకర్‌గౌడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పరిశ్రమల యజమానులకు ఝలక్

- అపాయింట్‌మెంట్ ఇవ్వని ఎమ్మెల్యే బాలకృష్ణ?
- అవినీతి బయట పడకుండా చక్రం తిప్పిన పీఏలు !

చిలమత్తూరు: హిందూపురం తూముకుంట పారిశ్రామికవాడలో పరిశ్రమల యజమానులు కలవాలని ప్రయత్నించగా ఎమ్మెల్యే బాలకృష్ణ వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిసింది. శనివారం ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించిన బాలకృష్ణను పారిశ్రామికవాడలోని పరిశ్రమల యజమానులు కలవాలని పీఏలతో అపాయింట్‌మెంట్ కోరారట. అయితే వారు నిరాకరించినట్టుగా తెలిసింది. తూముకుంట పారిశ్రామిక వాడలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు వివరించాలని, అలాగే మెడిసినల్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్లాంట్ ఏర్పాటు, రోడ్లు మెరుగుపరిచే తదితర అంశాలపై ఎమ్మెల్యే బాలకృష్ణకు కలిసి వివరించాలని అనుకున్నారని చెబుతున్నారు. అయితే మెడిసినల్ రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు ప్రతి పాదనలు గతంలోనే ఉండగా అందుకోసం రూ.6 కోట్లు ఖర్చు పెట్టేందుకు గతంలోనే హామీ కూడా ఇచ్చారు. ఈ అంశం తెరమీదకు వస్తే కూటమి నేతలు, పీఏల ఆదాయానికి గండి పడుతుందనే ఆలోచన కారణం కాగా, పారిశ్రామిక వాడలో 40 గుంతలు పూడ్చి వాటికి రూ.20 లక్షలు బిల్లులు పెట్టిన అంశం, ఇతరత్రా విషయాలు ఎక్కడ బయటకు తీస్తారేమో అని భయపడి అపాయింట్‌మెంట్ నిరాకరించినట్లుగా తెలుస్తోంది. తూముకుంట పారిశ్రామికవాడకు ఎన్‌టీఆర్ పేరు పెట్టాలని బాలకృష్ణ యోచిస్తున్నారని, దానికి తగ్గట్టు పారిశ్రామికవాడలో అభివృద్ధి ఉండాలి కదా అనే ప్రశ్నలు పరిశ్రమల యజమానులు వేస్తున్నారు. రైల్వేబ్రిడ్జి వద్ద రోడ్డు అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎమ్మెల్యేకు చెప్పి సమస్యలను పరిష్కరించుకోవాలనుకుంటే ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఆదివారం 2017–2020 సంవత్సరానికి చెందిన డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ కేశవయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గత జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు.


కంటైనర్ వాహనం బోల్తా

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో కంటైనర్ లారీ బోల్తాపడిన ఘటనలో ఆదివారం చోటు చేసుకుంది. నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌కు చెందిన కంటైనర్ వాహనం కియా అనుబంధ సంస్థ నుంచి విడిభాగాలను కియా పరిశ్రమకు సరఫరా చేస్తోంది. ఉదయం పాలసముద్రం నుంచి ముడిసరుకుతో కియా పరిశ్రమ వద్దకు వెళ్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై పరమేశ్వరపురం వద్ద కంటైనర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

వరద బాధితులకు చేయూత

పావగడ: ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో పరిహార యోజనలో మొదటి దఫా రెండు వేల బాధిత కుటుంబాలకు సహాయ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్వామి జపానంద పేర్కొన్నారు. ఎప్పటి లాగే ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తి సహాయ సహకారాలతో నడుస్తోందన్నారు. మంగళవారం నుంచి బాధిత కుటుంబాలకు సరుకుల కిట్ల పంపిణీ జరుగుతుందన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ


పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పాంచజన్య పాఠశాల శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా శ్రీనివాసులుతో పాటు ఆయన సతీమణి భారతి ఆదివారం దాదాపు వెయ్యిమంది పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎంఈఓ గంగప్ప చేతుల మీదుగా పంపిణీ జరిగింది. సమాజ సేవలో తనవంతుగా పేదలకు వస్త్రాలు అందించడం హర్షణీయమన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జేపీకే రాము, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ సందీప్, కరెస్పాండెంట్ నందకుమార్, డైరెక్టర్ సాయి కృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


పావగడ: జ్యోతులు మోస్తున్న మహిళలు


హిందూపురం: జ్యోతులు మోస్తున్న భక్తులు


రొద్దం: వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


లేపాక్షి: వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం/రొద్దం/లేపాక్షి/పావగడ: వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. హిందూపురంలోని ఇందిరమ్మ కాలనీలో సాంబశివ ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. తర్వాత వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. లేపాక్షి మండలంలోని లేపాక్షి, గొంగటిపల్లి, శిరివరం గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను జరుపుకున్నారు. నంది విగ్రహం నుంచి బస్టాండు, మెయిన్‌బజార్, పాత లేపాక్షి, కురాకులపేట తదితర ప్రాంతాల్లో మహిళలు జ్యోతులు మోశారు. రొద్దం మండల పరిధిలోని చెరుకూరులో మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్ర వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగించారు. పావగడ తాలూకా పరిధిలోని అరసికెరె, కోటగుడ్డ గ్రామాల్లో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాళేగార్ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహాల వద్ద పూజలు చేపట్టారు.